క్లుప్తంగా

పీలేరు సర్పంచ్‌కు చెక్ పవర్ రద్దు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ సర్పంచ్ హబీబ్‌బాషాకు చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్లు పంచాయతీ ఈఓ గురుమోహన్ తెలిపారు. పీలేరు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదులు అందడంతో డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో గత నెలలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ క్రమంలో సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు ఇచ్చారు. ఎంపీడీఓ, ఈఓ జాయింట్ అకౌంట్‌కు చెక్‌పవర్ కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కలకడ మండలం గజ్జికుంటపల్లెకు చెందిన షంషీర్ (20), ఆఫీఫ్ (22) వ్యక్తిగత పనులపై బైక్‌పై మదనపల్లెకు వెళుతుండగా ఆరోగ్యవరం వద్ద కారు ఢీకొట్టింది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలం

పెద్దతిప్పసముద్రం: పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. గురువారం మండలంలోని రంగసముద్రం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆహారపు అలవాట్లు, వైద్య సేవలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంతో వ్యాధులు దూరం

కలకడ : విద్యార్థులు సమతుల్య పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన వ్యాధులు దూరమవుతాయని, ఆరోగ్యంగా ఉంటారని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముడియంవారిపల్లెలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆరోగ్యసూత్రాలను తెలియజేశారు. ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

పీలేరు రూరల్ : మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఆటో కార్మికులు నిర్మించుకుంటున్న ఇంటి నిర్మాణాలను ఎలాంటి సంబంధంలేని వ్యక్తి అడ్డుకుంటున్నారని బిస్మిల్లా ఆటో యూనియన్ నాయకులు బోడేషా గురువారం తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు తోలుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లు తమ సొంత డబ్బులతో కాకులారంపల్లె పంచాయతీలో ఖాతా నంబరు 224లో సర్వే నంబరు 1073/3లో 1.52 ఎకరాల భూమిని 2020లో కార్మికులు కలసి కొనుగోలు చేశామని తెలిపారు. అప్పటి నుంచి ఆటో కార్మికులు చందాలు వేసుకుని చదును చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. సంబంధం లేని యల్లయ్య అనే వ్యక్తి వచ్చి నిర్మాణాలను అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

- ఘనంగా టీచర్స్ డే
- ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు అవార్డులు అందజేత



మదనపల్లె సిటీ: అవార్డు గ్రహీతలతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



కేవీపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్

మదనపల్లె సిటీ: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. గురువారం స్థానిక ఎస్‌వీఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదట మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విజ్ఞానానికి మారుపేరు గురువు అని అన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సన్మానించి, అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీయూ మాజీ సెనేట్ మెంబర్ రాటకొండ గురుప్రసాద్, డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, నారాయణ, పద్మావతి, కార్యక్రమ నిర్వాహకులు పఠాన్ మహమ్మద్‌ఖాన్,

సుబ్బారెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

మదనపల్లె పట్టణం జెడ్పీ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ ఎం.సుబ్బారెడ్డికి ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. రాయచోటిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ శివప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం

కలికిరి: సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందని పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, ఉపాధ్యాయులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎంఈఓ కరీముల్లా, హెచ్‌ఎం శారద, మాజీ ఎంపీపీ నాగభూషణరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గురువుల రుణం తీర్చుకోలేనిది

కేవీపల్లె : విద్యార్థుల ఎదుగుదలకు తోడ్పడే గురువుల రుణం తీర్చుకోలేనిదని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చదిద్దడంలో తల్లిదండ్రుల తరువాత గురువులదే ప్రధాన పాత్ర అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సర్వేపల్లె రాధాకృష్ణ అడుగుజాడల్లో నడిచి విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పాలని కోరారు. ఎస్‌ఎంసీ చైర్మన్ రెడ్డిబాషా, మాజీ చైర్మన్ సూర్యప్రకాష్ రెడ్డి, కమిటీ సభ్యుడు దుద్దు రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు ముందుకెళ్లాలని స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సావిత్రి అన్నారు. గురువారం స్థానిక పాఠశాల ఆవరణంలో గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని చింతపర్తి ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజ, దుర్వాసులు నాయుడు, భాస్కర్, రవీంద్ర రెడ్డి, ఉషారాణి, వసుమతి, తారాదేవి, రెడ్డెమ్మ, సలీంఖాన్, ఇర్షాద్‌బేగం పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలను తీర్చిదిద్దేది గురువులే

పెద్దతిప్పసముద్రం: భవిష్యత్ తరాలను సమున్నతంగా తీర్చి దిద్దేది గురువులేనని ఎంపీడీఓ కేఎస్ బాలాజీ అన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో గురువారం జరిగిన గురు పూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్ మాట్లాడుతూ ఉన్నత స్థానానికి ఎదిగిన ప్రతి ఒక్కరూ సమాజంలో గురువుల సేవలను శాశ్వతంగా గుర్తు పెట్టుకుంటారన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

కేవీపల్లె : విద్య నేర్పిన గురువులను పూజించిన వారికి ఉజ్వల భవిత ఉంటుందని గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ ఎం. చెన్నకేశవులు అన్నారు. గురువారం గ్యారంపల్లె ఏపీ గురుకుల జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి అధ్యాపకులు సాంబయ్య, శివమూర్తి, చంద్రశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు రమాదేవి, శేఖర్, అన్నపూర్ణ, హరి, సయ్యద్‌బాషా, నాగేంద్ర, షకీల్, కొండయ్య పాల్గొన్నారు.

పీలేరు : ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విజ్ఞానానికి, జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికుడని పేర్కొన్నారు. అనంతరం పలువురు గురువులను ఘనంగా సన్మానించారు. ఈ ఎంఈఓలు వై. లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి సీఆర్‌పీలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మదనపల్లె : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించినట్లు చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని శ్రీనివాస డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లె సంయుక్త నిర్వహణలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది మొత్తం 101 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చిన వెంటనే విద్యార్థులు తమవంతు సామాజిక బాధ్యతతో పెద్దసంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయడంపై అభినందించారు. అనంతరం గురువులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.కృష్ణారెడ్డి, గంగారపు గౌతమ్ రెడ్డి, బాబులాల్ భండారి, అప్పినపల్లె భాస్కరాచారి, మెంబర్స్ కే.ఎస్.ప్రసాద్, వాసుదేవప్రసాద్, కాలేజ్ ఏఓ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

తంబళ్లపల్లె: మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలతో పూజలు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు.

గుర్రంకొండ: ఉపాధ్యాయదినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఖండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో దివ్యఖురాన్ ప్రతులను పంపిణీ చేశారు. గురువారం స్థానిక పాఠశాలలో జమాతే ఇస్లామీ హింద్ సంస్థ జిల్లా శాఖ అధ్యక్షుడు ఆజం ఆలీఖాన్ అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

బి.కొత్తకోట: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం బి.కొత్తకోటలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆదర్శ విద్యాలయంలో విద్యార్థులు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధాకృష్ణ చిత్రపటాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఈఓ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని అన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. అనంతరం ఎంఈఓ రెడ్డిశేఖర్, ప్రిన్సిపాల్ శీనునాయక్‌ను సత్కరించారు. ఉపాధ్యాయులు హనుమంత్‌నాయక్, నూర్ మహమ్మద్, స్వామినాథన్, ప్రవల్లిక, శివశంకర్‌రెడ్డి, గాయత్రి పాల్గొన్నారు.

అత్యున్నత స్థానం గురువుది

కలకడ : సమాజంలో గురువుదే అత్యున్నత స్థానమని ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు, మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామసముద్రం: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి, అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మునస్వామి నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు

పీలేరురూరల్ : పీలేరు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న నటరాజన్‌కు ఉత్త ప్రధానోపాధ్యాయ అవార్డు లభించింది. గురువారం ఉపాధ్యాయ దినోత్సాన్ని పురష్కరించుకుని రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాజంపేట ఎమ్మెల్యే అకేపాటి అమరనాథరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి యు. శివప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

కురబలకోట: గురువులు మార్గనిర్దేశకులని అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆర్‌ఆర్‌ఆర్ అకాడమీ అధ్యక్షుడు నాదేళ్ల ద్వారకనాథ్ అన్నారు. టీచర్స్‌డేని పురష్కరించుకుని గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లె రాధాకృష్ణ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. జాతి నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమన్నారు. మండలంలో అత్యుత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు ద్వారకనాథ్, శ్రీనివాసులు సత్కరించారు.

మైక్‌సెట్ వితరణ

కేవీపల్లె : మండలంలోని వగళ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి దాతలు మైక్‌సెట్ వితరణ చేశారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏఎన్‌ఎం సులోచన ప్రోత్సాహంతో పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థులు తన్వి, నీక్షిత, ఎనిమిదో తరగతి విద్యార్థిని అర్పిత, తొమ్మిదో తరగతి విద్యార్థిని అనిత, పదో తరగతి విద్యార్థినులు శ్రీలత, హేమావతి, అశ్విత తల్లిదండ్రులు పాఠశాలకు మైక్‌సెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రావణి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



బి.కొత్తకోట: ఆదర్శపాఠశాల విద్యార్థులు రంగులతో వేసిన సర్వేపల్లె రాధాకృష్ణ చిత్రపటం



వాల్మీకిపురం: సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పెద్దతిప్పసముద్రంలో ఉత్తమ గురువులతో ఎంఈఓలు



మదనపల్లె : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీనివాస డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం



తంబళ్లపల్లె: రేణికుమాకులపల్లెలో మొక్క నాటుతున్న ఎంఈఓ త్యాగరాజు



పీలేరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి

నీటి తొట్టెలో పడి బాలిక మృతి

మదనపల్లె : ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి బాలిక మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన సోమశేఖర్, సునీత దంపతులు. వీరికి నవ్య శ్రీ(9)తోపాటు మరో అబ్బాయి సంతానం ఉన్నారు. ఆరు నెలల క్రితం సోమశేఖర్ మృతి చెందాడు. స్థానికంగా ఓ అద్దె ఇంట్లో సునీత పిల్లలతో కలిసి ఉంటూ కూలీ పనులకు వెళ్తూ జీస్తోంది. నవ్య శ్రీ మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతూ స్వల్పంగా బుద్ధిమాంద్యంతో బాధపడుతుండేది. స్థానికంగా నాలుగో తరగతి చదువుతుండేది. గురువారం సునీత ఇంట్లో వంట చేసుకుంటుండగా, నవ్య శ్రీ నీటి తొట్టెలో పడిన మగ్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తు తలకిందులుగా తొట్టెలో పడిపోయింది. చాలాసేపటి వరకు ఎవరూ ఈ విషయాన్ని గమనించలేదు. కొంతసేపటికి సునీత కుమార్తె కనపడకపోవడంతో వెతకగా నీటి తొట్టిలో పడి ఉండటాన్ని గమనించింది. వెంటనే స్థానికుల సాయంతో బాలికను 108 అంబులెన్స్‌లో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించింది. అయితే పరీక్షించిన వైద్యులు బాలిక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీ గదికి తరలించారు. తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఘరానా మోసం

- బాధితుల వద్ద నుంచి రూ. 36.59 లక్షలు వసూలు
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

మదనపల్లె : సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని, శిక్షణతోపాటు లక్షల్లో జీతాలు ఇస్తామని నమ్మబలికి, బాధితుల వద్ద నుంచి రూ. 36.59 లక్షలు వసూలు చేసుకుని మోసం చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గురువారం తాలూకా సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలి మండలం తిమ్మయ్య గారి పల్లె పంచాయతీ చిల్లవాండ్లపల్లికి చెందిన వెంకటసుబ్బయ్య కుమారుడు మురళీకృష్ణ (35) ఎంసీఏ పూర్తి చేశాడు. ఇతనికి భార్య స్వప్న కుమారుడు రియాన్ ఉన్నారు. చదువు పూర్తయిన తర్వాత స్టార్టప్ కంపెనీ పెట్టి డబ్బు సంపాదించాలనుకున్నాడు. హైదరాబాదులోని ప్రగతి నగర్, చేకు కాలనీ, నిర్వాణ మెజిస్టిక్‌లో ప్లాట్ నెంబర్ 403లో హవిక్ సాఫ్ట్ వేర్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ ను తాను కంపెనీ డైరెక్టర్‌గా ప్రారంభించాడు. చిట్వేలి మండలం నక్కలపల్లి పంచాయతీ గొల్లపల్లికి చెందిన వెంకటేష్ కుమారుడు కే రమణ (29) బీకాం కంప్యూటర్ చదివి, ఉద్యోగం మానేసి ఇంటి వద్ద ఉండడంతో అతనిని తన కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్‌గా నియమించుకున్నాడు. ఇతను హైదరాబాదులోని అదే ప్రాంతంలో ప్లాట్ నెంబర్ 503 లో ఉంటూ కార్యకలాపాలు నిర్వహించేవాడు. మొదట కొద్ది రోజులపాటు కంపెనీ బాగానే నడిచింది. తర్వాత కంపెనీకి కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో నష్టాలు మొదలయ్యాయి. దీంతో కంపెనీ నష్టాలను పూడ్చుకోవడంతోపాటు, సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో, గతంలో తమ కంపెనీలో పని చేసి మానేసిన, మదనపల్లె పట్టణం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన భరద్వాజ్‌ను సంప్రదించారు. కంపెనీకి కొత్త ప్రాజెక్టులు వచ్చాయని, ఉద్యోగులను నియమించుకుంటున్నామని తనకు తెలిసిన వారిని సిఫారసు చేయాల్సిందిగా కోరారు. అభ్యర్థులు ముందుగా ఒక్కొక్కరు 2.5 లక్షల రూపాయలు చెల్లిస్తే, మూడు నెలల పాటు జీతంతో కూడిన శిక్షణ ఇచ్చి, రూ.నాలుగు లక్షల ప్యాకేజీ తో ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. వారి మాటలు నమ్మిన భరద్వాజ్ వివిధ ప్రాంతాలకు చెందిన 15 మంది వద్ద నుంచి రూ.36.59 లక్షలు వివిధ దశల్లో, మురళీకృష్ణ, రమణ అకౌంట్లకు నగదు చెల్లించాడు. 15 మందిని శిక్షణకు పిలిచారు. ఆ కాలంలో జీతం ఇవ్వకపోగా, శిక్షణ పూర్తి అయిన తర్వాత ఉద్యోగ నియామకాలు చేయలేదు. దీంతో బాధితులంతా తాము డబ్బులు ఇచ్చిన భరద్వాజ్ పై ఒత్తిడి తెచ్చారు. దీంతో భరద్వాజ్ హవిక్ సాఫ్ట్ వేర్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ మురళీకృష్ణ, హెచ్‌ఆర్ మేనేజర్ రమణలపై తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాఫ్ట్‌వేర్ కొలువులు ఇప్పిస్తామని మోసం చేసిన నిందితులను గురువారం మదనపల్లె-తిరుపతి రోడ్డులోని వినాయక దేవాలయం వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచామన్నారు.

వినాయకచవితిని ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : వినాయకచవితి ఉత్సవాలను మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పిలుపునిచ్చారు. గురువారం సబ్ కలెక్టరేట్ సమావేశమందిరంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలన్నారు. నిమజ్జనాన్ని పోలీసులు సూచించిన విధంగా నిర్వహించాలని సూచించారు. డీఎస్పీ కొండయ్యనాయుడు, తహసీల్దార్ ఖాజాబీ, ఫైర్‌ఆఫీసర్ పురుషోత్తం, సీఐలు చాంద్‌బాషా, కే.రామచంద్ర, కళా వెంకటరమణ, రమేష్ పాల్గొన్నారు.

పెద్దమండ్యం: వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగను సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ శంకరరెడ్డి, ఆర్ఐ రమేష్, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

బి.కొత్తకోట: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తహసీల్దార్ శ్రీధర్‌రావు, సీఐ రాజారెడ్డి కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహాలను ప్రతిష్టించే నిర్వాహకులు పోలీసు యాప్ గణేష్ ఉత్సవ్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న వారికి ఎన్‌ఓసీ ధృవప్రతం జారీ అవుతుందని చెప్పారు. ఆర్ఐ బాలాజీ, మాజీ సర్పంచులు కుడుం శ్రీనివాసులు, డి.నారాయణస్వామిరెడ్డి, కంచి లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి

కలికిరి: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలు మట్టి విగ్రహాలనే పూజించాలని తహసీల్దారు మహేశ్వరిబాయి కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగయ్య, హెచ్‌సీ రాజేంద్రప్రసాద్, డీటీ నవీన్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : వినాయకచవితి పర్వదినం సందర్భంగా మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉత్సవకమిటీలదేనని తహసీల్దార్ ధనంజయులు తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

పెద్దతిప్పసముద్రం: చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరూ కచ్చితంగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ నరసింహుడు సూచించారు. బుధవారం ఆయన సిబ్బందితో కలసి మండలంలోని కందుకూరు ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చవితి పండుగను ప్రజలంతా కలసి మెలసి సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు.

భూ వివాదంతో హత్యాయత్నం

మదనపల్లె : భూవివాదం కారణంగా బంధువులే దంపతులపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెంచుపాడు పంచాయతీ పనసమానుకుంటకు చెందిన పుల్లానారాయణ(60)కు, అదే గ్రామానికి చెందిన పుల్లాశ్రీరాములు, చెన్నకేశవులతో భూవివాదం ఉంది. ఆ విషయంగా కోర్టులో కేసు నడుస్తోంది. గురువారం కోర్టు వాయిదాకు వెళ్లాల్సి ఉంది. అయితే ఈ క్రమంలో బుధవారం రాత్రి పుల్లా శ్రీరాములు, చెన్నకేశవ ఇద్దరూ కలిసి కొడవలి, చాకు, కర్రలు తీసుకుని నారాయణ ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో ఉన్న నారాయణతోపాటు భార్య కమలమ్మపై దాడికి పాల్పడ్డారు. నారాయణపై విచక్షణారహితంగా ఆయుధాలతో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘటనలో నారాయణ తలకు తీవ్రగాయాలు కాగా, కుటుంబ సభ్యులు 108 వాహనంలో బాధితుడ్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కదిలిన అధికార యంత్రాంగం

–కస్తూర్బా పాఠశాల తనిఖీ



బాలికలతో కలిసి భోజనం తింటున్న అధికారులు

ములకలచెరువు : స్థానిక కస్తూర్బా పాఠశాలలో పురుగుల భోజనం.. అపరిశుభ్ర నీళ్లు అనే కథనం సాక్షి దినపత్రికలో గురువారం కథనం వచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనంపై అధికార యంత్రాంగం కదిలింది. శుక్రవారం ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓ వెంకటరమణ పాఠశాలకు చేరుకొని బాలికలకు వడ్డిస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం రేషన్ గోదాములోని సరుకులను పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ భోజనం నాణ్యత, తాగునీటిపై ఫిర్యాదులు అందితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిమ్మనపల్లె : మండలంలోని ముష్టూరు వద్ద ఉన్న కస్తూర్బా విద్యాలయాన్ని గురువారం ఎంపీడీఓ రమేష్ తనిఖీ చేశారు. విద్యాలయంలోని వసతులను పరిశీలించారు. హాస్టల్‌లో సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజన నాణ్యతను పరిశీలించి, అక్కడే భోంచేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన వసతి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.